క్లుప్తంగా

భూమనను మర్యాద పూర్వకంగా కలిసిన వేమా



భూమన కరుణాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, టీటీడీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన భూమన కరుణాకర్ రెడ్డిని తిరుపతిలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రెండోసారి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు వేమా శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు కిలో ధర రూ. 277

ఒంగోలు రూరల్: రూరల్‌లోని పొగాకు వేలం కేంద్రం-2లో మంగళవారం కిలో పొగాకు ధర రూ. 277 పలికింది. మంగళవారం వేలం కేంద్రానికి 708 బేళ్ళు రాగా 679 బేళ్ళను కొనుగోలు చేశారు. 2 బేళ్ళు నోబిడ్ కాగా, కిలో గరిష్ట ధర రూ.277 పలికింది. కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.263.61 గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామక్రిష్ణ తెలిపారు.

నేటి నుంచి పోస్టాఫీసుల్లో హర్ ఘర్ తిరంగ

మార్కాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ఈనెల 9 నుంచి అన్ని పోస్టాఫీస్‌లలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను అందుబాటులో ఉంచినట్లు మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. రూ.25 చెల్లించి జాతీయ జెండాను కొనుగోలు చేసి ప్రతి ఇంటిపై ఎగురవేయాలని సూచించారు. అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

22 నుంచి వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు

పొదిలి: స్థానిక సాయి బాలాజీ నగర్‌లోని భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, 23న ధుని పూజలు, 24న సుప్రభాత సేవ నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ముగింపు ఉత్సవాలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ అనంతరం స్వామి వారి రథోత్సవం జరుగుతుంది. కోలాటం, తిరుపతమ్మ కథా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని స్వామి సేవా సమితి సభ్యులు కోరారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల కక్షిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ మార్గం ద్వారా లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

రెండు చోట్ల ఉప ఎన్నికలు

కంభం: మండలంలోని ఔరంగబాద్ పంచాయతీలో 8 వార్డుకు (బీసీ-మహిళ), పెద్దనల్లకాల్వ పంచాయతీలో 5వ వార్డుకు (జనరల్-మహిళ) ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి మంగళవారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు, 11వ తేదీ స్క్రూటీనీ, 12వ తేదీ అభ్యంతరాలపై ఫిర్యాదులు, 14వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక, అదే రోజు రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

సర్వేయర్ లేక ఇబ్బందులు

రాచర్ల: మండలంలోని అనుమలవీడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయం సర్వేయర్ రాములు గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామానికి బదిలీపై వెళ్లి దాదాపు నెల దాటుతున్నా ఇంతవరకూ అనుమలవీడు సచివాలయానికి ఇన్‌చార్జి సర్వేయర్ లేదా రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించక పోవడంతో పాలకవీడు రెవెన్యూ పరిధిలో ప్రజలు అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. పాలకవీడు రెవెన్యూ పరిధిలో రీసర్వే పూర్తయినా పొలం చుట్టూ రాళ్లతో పాటు హద్దులు వేసేందుకు అనుమలవీడు సచివాలయం సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనుమలవీడు సచివాలయంలో సర్వేయర్ నియామకంపై మండల రెవెన్యూ అధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

దర్శి: మండలంలోని తూర్పు వీరాయ పాలెంలో మందాడి వీరాంజనేయులు అనే యువకుడు కనిపించకుండా పోయాడని మందాడి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు వీరాంజనేయులుకు 30 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. వివాహం కాలేదు. తన చావుకు ఎవరూ కారణం కాదు అని లెటర్ రాసి పెట్టి ఇంట్లో నుంచి వెళ్ళి పోయాడు.

గ్రామీణ ఆరోగ్యంపై రిమ్స్ ప్రొఫెసర్ల సర్వే

మద్దిపాడు: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లు ప్రజలకు ఎంత మేర ప్రజలకు ఉపయోగపడుతుందో తెలుసుకోవడానికి రిమ్స్ ప్రొఫెసర్లు, హౌస్‌సర్జన్లు మంగళవారం మండలంలోని వెల్లంపల్లిలో సర్వే నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఏ పద్ధతులు అనుసరించాలో వంటి విషయాలనువారు పరిశీలించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ మధుమేహం, హైపర్ టెన్షన్‌కు సంబంధించిన పరీక్షలు జరుగుతున్నాయా, మందులు అందుతున్నాయా గర్భిణులకు, బాలింతలుతో సహా అందరికీ ఎటువంటి సేవలు అందుతున్నాయో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. వెల్లంపల్లిని నాలుగు రోజులపాటు సందర్శిస్తామని అన్నారు. అనంతరం పొదిలి మండలంలోని ఏలూరులో సర్వేనిర్వహించాల్సి ఉందని తెలిపారు. రిమ్స్ కమ్యూనిటీ హెల్త్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్పందన, డాక్టర్ ప్రదీప్ బృందం, 25 మంది హౌస్ సర్జన్‌లు, మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్లు ఆనందమోహన్, జగదీష్, హనీఫ్, ఎంపీహెచ్‌ఈఓలు లలితమ్మ, వెంకారెడ్డి, ఎంపీహెచ్‌ఎస్‌లు నాగేశ్వరరావు, పద్మావతి హెల్త్ క్లినిక్ సిబ్బంది మెడికల్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



వెల్లంపల్లిలో రిమ్స్ ప్రొఫెసర్లు, హౌస్‌సర్జన్‌లు, ఆసుపత్రి డాక్టర్లు

గద్దర్‌కు ఘన నివాళి

ఒంగోలు మెట్రో: ఓ చైతన్య గీతం అనంత వాయువుల్లో కలిసిపోయింది. ఓ యుద్ధ నౌక అనంత తీరాలకు తరలిపోయింది అంటూ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ భావోద్వేగంతో పలికారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని నరసం కార్యాలయంలో జరిగిన గద్దర్ సంతాప సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా తొంభై దశకంలో ఆయనతో కలిసి సారావ్యతిరేక ఉద్యమంలో తాను పాల్గొన్న సంఘటను ఆమె గుర్తు చేసుకున్నారు. ప్రజలను చైతన్య పరచటంలో, ఉద్యమాలను సమర్థవంతంగా నడపటంలో పాటను ఆయుధంగా చేసుకున్న ఆయన జీవన గమనం చరితార్థమైందని ఈ సందర్భంగా పాల్గొన్న కవయిత్రులు అభిప్రాయపడ్డారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి తన పాటతో గద్దర్‌కు జోహార్లు అర్పించారు. గద్దర్ చిత్రపటంతో జోహార్లు సమర్పిస్తూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. నరసం ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి కృపావరం, కోశాధికారి బీరం అరుణ, ఎక్స్ ఎంపీపీ నాళం నరసమ్మ, కె.కాంతిలత పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న నవ్యాంధ్ర రచయితల సంఘ సభ్యులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

మార్కాపురం: విశాఖపట్నంలో ఈ నెల 6, 7వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మార్కాపురం ఎంఎస్ స్పోర్ట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు సంస్థ ప్రతినిధి ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 10 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడల్స్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. పోటీలకు ముఖ్య అతిథిగా వరల్డ్ కరాటే రిఫరీ సీషాన్ అక్కుతార్ హాజరై బహుమతులు అందజేశారని చెప్పారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

చీమకుర్తి: బండ్లమూడీ పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం నాయుడుపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈనెల 10న నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. డాక్టర్ నవీన్, హెచ్‌ఎంలు రమేష్, ఏసుదాస్ పాల్గొన్నారు.



ఆరోగ్యంపై విద్యార్థులకు వివరిస్తున్న వైద్య సిబ్బంది

రుణాలు సకాలంలో చెల్లించండి

దొనకొండ: గ్రామాల్లోని గ్రూపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మరలా రుణాలు పొంది వారి కుటుంబ జీవనోపాధికి ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో మంగళవారం ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీ శిక్షణ గ్రూపు మహిళలకు నిర్వహించారు. ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, సీసీలు కోటేశ్వరరావు, పాపారావు, రత్నకుమారి, ప్రసన్న, వీఓఏలు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు



చెత్త సేకరణను పరిశీలిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: నగరంలో చెత్త సేకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని నగర కమిషనర్ యం. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని మామిడిపాలెంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. పూడికతీత పనులను పరిశీలించి వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగునీరు రోడ్ల మీదకు రాకుండా ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క ఇంటి నుంచి చెత్త సేకరణ చేసి క్లాప్ ఆటోకు ఇవ్వాలన్నారు. ప్రతి రోజూ మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ కోసం ఇంటి వద్దకు వస్తున్నారో లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మూడు బుట్టల సేకరణ గురించి అవగాహన కల్పించాలని అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజల నుంచి యూజర్ ఫీజ్‌ను తప్పనిసరిగా సేకరించాలని సచివాలయ నోడల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ కాశి మహంతి చంద్రకళ, శానిటరి ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం



ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ ఆవుల వెంకటరెడ్డి

కురిచేడు: స్థానిక ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించారు. కొంతకాలంగా ఎస్సీ కాలనీ ప్రజలు డ్రైనేజీ సమస్యపై పలుసార్లు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు తమ సమస్య వివరించారు. అనంతరం సర్పంచ్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటరెడ్డి, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను కలిసి గడపగడప నిధుల్లో డ్రైనేజీ పనులు చేయించేందుకు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య తెలిపారు. కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత ఆశయ సాధనకు కృషి చేయండి

ఒంగోలు: శ్రమించే తత్వం మీదైతే మీ ఉన్నతికి అండగా తాముంటామని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కె.నరసింగరావు పేర్కొన్నారు. మంగళవారం కాలేజీలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ ప్యూపిల్స్ లెర్నింగ్ సెంటర్ (ఐ.పి.ఎల్.సి) అనే కాన్సెప్ట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాలేజీలో విద్యను అభ్యసించిన ప్రతి ఒక్కకూ ఒక ఆశయంతో బయటకు వెళ్ళాలన్నారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలనే తపనే తమ కాన్సెప్ట్‌కు నిదర్శనమన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నటరాజ్ మాట్లాడుతూ ఇక్కడ విద్యనభ్యసించిన వారు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పోస్టులకు ఎంపికయ్యారని, ఈ నేపథ్యంలో ఆసక్తిగల, ఉత్సాహంతో కూడిన పలువురు విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కాలేజీ కమిటీ సభ్యులు బత్తిన మహేష్ చేతులమీదుగా విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్, నోట్సులు, బ్యాగు అందించారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ అందిస్తున్నామన్నారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ల హరిబాబు, టీచింగ్ ఫ్యాకల్టీ సుంకర సాయిబాబు, హేమలత, శార్వాణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కిట్‌ను ప్రదర్శిస్తున్న కాలేజీ కార్యదర్శి సీవీ రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ నటరాజ్ కుమార్

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో లాభం

ముండ్లమూరు: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా సమాజానికి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని ప్రకృతి వ్యవసాయ మెంటర్ సాకప్ప తెలిపారు. పూరిమెట్లలో ఘన జీవామృతం తయారుపై మంగళవారం అవగాహన కల్పించారు. సిబ్బంది ప్రభాకర్, శివనాగిరెడ్డి, ఐసీఆర్‌పీ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కొత్తపట్నం: ఒంగోలు నగరం భాగ్యనగర్‌లో ఉన్న బొమ్మరిల్లు అనాత శరణాలయంలో చదువుతున్న పేద పిల్లలకు మదర్ థెరీసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు మంగళవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పిట్ల బాలకృష్ణ కుమారుడు పిట్ల ఈక్షిత్, కుమార్తె సుస్వర స్కూల్ బ్యాగ్, బుక్స్, పెన్సిల్స్, పెన్నులు సహాయం చేశారు. సాయం చేయడంలో తృప్తి ఉంటుందన్నారు. హెల్పింగ్ టీమ్ సభ్యులు ఆర్గనైజర్ డి.కేశవ, ఎం.సునీల్, బి.డానియల్, సి.బాలకృష్ణ, డి.సుజిత్, ఎం.ప్రేమ్ కుమార్, ఎం.ప్రసాద్, ఎం.సన్నీ. ఎం.రాజ్ కుమార్, ఎం.చంద్ర, డి.ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మరిల్లు అనాథ శరణాలయంలో మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెల్పింగ్ టీం సభ్యులు

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

చీమకుర్తి: సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, తహసీల్దార్ ఎస్‌డీ ఇస్మాయిల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. రెండో సెషన్‌లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అకడమిక్ డీన్ ఎం.రూపాస్ కుమార్ హాజరయ్యారు. ఏఓ రమేష్‌బాబు, ఓఎస్‌డీ నారపరెడ్డి, డీన్ సుగుణరావు, మీరావలి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి

బ్యాంకుకు జమ కాని రూ.3.38 లక్షలు

యర్రగొండపాలెం: బీసీ పాయింట్ నుంచి స్వయం సహాయక సంఘాలు జరిపిన లావాదేవీల్లో రూ.3.38 లక్షలు త్రిపురాంతకం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు జమ కాలేదని మంగళవారం యర్రగొండపాలెం మండలం నరసాయపాలెంలో చేపట్టిన విచారణలో వెల్లడయింది. ఆ బ్యాంకు బీసీ పాయింట్ నిర్వాహకుడు గుంటక వెంకటరెడ్డి పొదుపు గ్రూపుల డిపాజిట్లు గల్లంతు చేసిన విషయం విదితమే. రెండో రోజు 23 గ్రూపులకు సంబంధించి ఏపీజీబీ అధికారులు విచారణ జరిపారని, ఈ విచారణలో రూ.1,60,800లు బ్యాంకుకు జమ కాలేదని గుర్తించారని డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి తెలిపారు. రెండు రోజులుగా జరిపిన విచారణలో రూ.3.38 లక్షలు బీసీ పాయింట్ నిర్వాహకుడు బ్యాంకులో జమ చేయలేదని తేలిందని, మరో 12 గ్రూపులకు సంబంధించిన లావాదేవీలను పరిశీలించాల్సి ఉందని ఆయన తెలిపారు. యర్రగొండపాలెం మండలంలోని నరసాయపాలెం, గంగపాలెం గ్రామాల పరిధిలోని 56 స్వయం సహాయక సంఘాలు నరసాయపాలెంలో ఉన్న ఆ బ్యాంకు బీసీ పాయింట్‌లో సేవింగ్ డిపాజిట్లు, రుణాల లావాదేవీలు జరుపుతున్నారు. తమ అకౌంట్ పుస్తకాల్లో తాము చెల్లించిన నగదును నమోదు చేసి ఆ నగదును బీసీ పాయింట్ నిర్వాహకుడు బ్యాంకుకు జమ చేయడం లేదని వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ చేపడుతున్నారు. పొదుపు గ్రూపులతో పాటు ఇతర ఖాతాదారుల అకౌంట్లను కూడా పరిశీలిస్తామని వారు తెలిపారు. విచారణలో ఏపీజీబీ మార్కాపురం ఏరియా నోడల్ అధికారి ఈ.మనోజ్, ఏపీఎంలు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న నోడల్ అధికారి మనోజ్

నీటి వనరులపై ఎంపీ ప్రశ్న

ఒంగోలు: దేశంలో నీటి వనరుల పరిరక్షణ, నిర్వహణ చర్యలపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ శాఖ సహాయక మంత్రి అశ్విని కుమార్ చౌబే సమాధానం ఇచ్చారు. జాతీయ నీటివనరుల జాబితా, అంచనా కార్యక్రమంలో భాగంగా స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఇస్రో, అహ్మదాబాద్ వారు ప్రచురించిన భౌగోళిక పటం ప్రకారం దేశం మొత్తంలో 2,31,195 నీటి వనరులు గుర్తించామన్నారు. వాటి ప్రాంతం/ ఏరియా 1,59,81,516 చదరపు హెక్టార్లని, అందులో రాష్ట్రంలో 24104 నీటివనరులు వాటి విస్తీర్ణం 11,41,606 హెక్టార్లుగా గుర్తించామన్నారు. దేశంలో నదులు-సరస్సులతో సహా అన్ని నీటి వనరుల పరిరక్షణ, నిర్వహణకు కేంద్రం, రాష్ట్రాలు ఖర్చు భాగస్వామ్యంతో కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల శాఖ నేషనల్ ప్లాన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ ఆక్వాటిక్ ఎకో సిస్టమ్స్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. నీటి నిలుపుదల, వృథా నీటి మళ్లింపు, తీర ప్రాంత రక్షణ, సరస్సుల అభివృద్ధి, పూడిక , కలుపుతీత, తుఫాను నీటి నిర్వహణ, కలుషిత ప్రదేశాల శుభ్రపరచడం, సరస్సుల సుందరీకరణ, సర్వే, హద్దుల నిర్ణయం, ఫెన్సింగ్, మత్స్య సంపద అభివృద్ధి, కలుపు నియంత్రణ, జీవ వైవిధ్య పరిరక్షణ, అవగాహన సృష్టి, ప్రజల భాగస్వామ్యం వంటి వివిధ కార్యకలాపాలు ఈ పథకం కింద నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌ను కలిసిన బన్నీ

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వైఎం ప్రసాద్ రెడ్డి (బన్నీ) మంగళవారం సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే పెద్ద బాధ్యతలు చేపట్టారంటూ ప్రసాద్ రెడ్డిని అభినందించారు. ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకనుగుణంగా, రైతన్నలకు అండగా ఉంటూ వారి సమగ్రాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని బన్నీ అన్నారు.



ఎమ్మెల్యే సుధాకర్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాద్ రెడ్డి

కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆర్‌సీఎం సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, చీరాల ఆదినారాయణపురం ఆదిమవాసి ఎయిడెడ్ పాఠశాల, హనుమంతునిపాడు మండలం ఈదరవారిపల్లి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే 35 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంల సర్వీసు రిజిస్టర్ల వెరిఫికేషన్ జరిగింది. ఏపీటీజీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఖాళీల జాబితా ప్రకటించి త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు షెడ్యూల్ విడుదల చేయాలన్నారు.

విద్యార్థినికి శివం ఫౌండేషన్ సాయం

ఒంగోలు సిటీ: పట్టుదలతో చదువుకోవాలనే బలమైన సంకల్పం ఉన్న పేద విద్యార్థినికి శివం ఫౌండేషన్ రామనగర్ 8 లోని ఆలూరి నర్సింగ్ చదువుతున్న చీమకుర్తికి చెందిన ధనలక్ష్మికి మంగళవారం ఆర్థిక సాయం చేశారు. మూడో సంవత్సరం ఫీజు రూ. 30,000 కాలేజీ వారికి చెల్లించారు. చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ఫీజులు చెల్లించి చదివిస్తున్నామన్నారు. చదువు కోసం ఎవరికైనా సహాయం కావాలంటే తమను సంప్రదించాలని కోరారు. నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవ, కాలేజీ కరస్పాండెంట్ కిషోర్, కోసూరి శ్రీదేవి, నాగ ఆంజనేయులు, రామకృష్ణ, తిరుమల, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



ధనలక్ష్మికి ఆర్థిక సాయం చేస్తున్న శివం ఫౌండేషన్

నూతన టెక్నాలజీతో ఉపయోగం

ముండ్లమూరు: గ్రామాల్లో రైతులు నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని సులభతరం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫరూక్ తెలిపారు. పసుపుగల్లులో మంగళవారం రోబో టెక్ కంప్యూటర్ పరిజ్ఞానంతో రూపొందించిన రోబో ట్రాక్టర్ పని తీరుపై రైతులకు అవగాహన కల్పించారు. రెండు కిలో మీటర్ల నుంచి ఈ రోబో ట్రాక్టర్‌ను ఆపరేట్ చేయవచ్చన్నారు. రైతులు శ్రీనివాసరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, కైపు వెంకటేశ్వరరెడ్డి, చేరెడ్డి రామమునిరెడ్డి, మేడగం తిరుపతిరెడ్డి, సీతారామిరెడ్డి, బ్రహ్మారెడ్డి, కోటి లింగారెడ్డి పాల్గొన్నారు.



రోబో ట్రాక్టర్ పని తీరును వివరిస్తున్న సాంకేతిక నిపుణులు

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలు

ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మున్నంగి వెంకటరామిరెడ్డికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి పొదిలి వెళ్తున్న కారును మార్గమధ్యంలో దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో ఎదురుగా వస్తున్న పాల లారీ ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌కు గాయాలు కావడంతో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యూవీ కృష్ణయ్య తెలిపారు.



ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న కారు

యాజమాన్య పద్ధతులే కీలకం

దర్శి: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మిరపలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యానవన శాస్త్రవేత్త యమ్‌శివ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో మిరపపండించే ప్రొగ్రసిల్ రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. శివ మాట్లాడుతూ యాజమాన్య చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. శాస్త్రవేత్తలు ఎం. ఉష, యల్. రాజేష్ చౌదరి, రిలియన్స్ ఫౌండేషన్ డీపీఓ బాబురావు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు